క్లుప్తంగా

వాయుపుత్రునికి విశేష పూజలు


పూజలందుకున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌతాళంతో పాటు అగసల దిన్నె, సుళేకేరిలోని బుడుములదొడ్డి, ఎరిగేరిలోని పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్ల వారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు మదిరె విద్యార్థిని ఎంపిక


వి.మౌనిక

ఆదోని సెంట్రల్/ఆదోని రూరల్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)లో ఆదోని మండలం మదిరె గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని వి. మౌనిక ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు టి.రత్నం తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థినికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. బాలికకు ఏడాదికి రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివితే విజయం తప్పక వరిస్తుందన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు విద్యార్థినిని అభినందించారు.

ఓటింగ్‌పై అవగాహన


ఈవీఎం పనితీరును వివరిస్తున్న ఎన్నికల డీటీ

ఆదోనిరూరల్: పట్టణంలోని క్రాంతినగర్ 222, 223, 224, 225, 226 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రజలకు శనివారం ఈవీఎం ద్వారా ఎలా ఓటు వేయాలనే అంశంపై ఏఈఆర్‌ఓ, ఎన్నికల ఉప తహసీల్దార్ ఎజాజ్‌అహ్మద్ అవగాహన కల్పించారు. ఫిబ్రవరి చివరి వరకు వీటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా ఈవీఎంల పనితీరును తెలుసుకోవాలన్నారు. నచ్చిన నాయకుడిని ఎలా ఎన్నుకోవాలో, ఎక్కడ బటన్ నొక్కాలో ప్రాక్టికల్‌గా చూపించారు. సూపర్‌వైజర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపిక


క్రీడాకారిణిని అభినందిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు

ఆదోనిఅర్బన్: అండర్–17 క్రికెట్ జిల్లా జట్టుకు పట్టణానికి చెందిన 9వ తరగతి విద్యార్థిని సంజన ఎంపికైంది. తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు విట్టా రమేష్, పులికొండ వెంకటేష్, కోచ్ బాలాజీ సంజనను అభినందించారు. విట్టా రమేష్ మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం కర్నూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికైందని తెలిపారు. ఈనెల 29, 30, 31వ తేదీల్లో నరసారావుపేటలో జరిగే అంతర్‌జిల్లా పోటీల్లో కర్నూలు జిల్లా తరఫున క్రికెట్ ఆడనుందని చెప్పారు. అక్కడ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణికి తాలూకా క్రికెట్ అసోసియేషన్, ఆర్ట్స్ కళాశాల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. క్రీడాకారిణి తండ్రి పంపాపతి ఉన్నారు.

మార్చి 9న జాతీయ లోక్‌అదాలత్

ఆదోనిరూరల్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని మార్చి 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.జె.సుధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్‌లో సివిల్, చెక్‌బౌన్స్, బ్యాంకింగ్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుటుంబాలను కలిపేలా కౌన్సెలింగ్

కర్నూలు : చిన్నచిన్న సమస్యలు, కారణాలతో దూరమైన భార్యాభర్తలను కలిపేలా ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు దిశ మహిళా పీఎస్ డీఎస్పీ ఐ.సుధాకర్‌రెడ్డి అన్నారు. వివిధ కారణాలతో పోలీసులను ఆశ్రయించిన జంటలకు శనివారం దిశ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కలసి ఉంటేనే కుటుంబాలు బాగుంటాయని, క్షణికావేశంలో తల్లిదండ్రులు తీసుకునే నిర్ణయాలతో పిల్లలు అనాథలు కాకూడదని జంటలకు సూచించారు. చిన్నపాటి కారణాలతో విడిపోకూడదని, సర్దుకుపోతేనే జీవితం సాఫీగా సాగుతుందన్నారు.

ఆసరా వెలుగులు

- జగనన్న పాలనలో పేదల కష్టాలు తీరాయి
- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- రెడ్డీస్ హాస్టల్‌లో ఆసరా మెగా చెక్ విడుదల
- సీఎంకు పాలాభిషేకం, ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు
- భారీగా తరలివచ్చిన మహిళలు



మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, కమిషనర్

ఆదోనిటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల కష్టాలు తొలిగాయని.. ముఖ్యంగా మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని.. ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రెడ్డీస్ హాస్టల్‌లో ఆదోని నియోజకవర్గస్థాయి వైఎస్సార్ ఆసరా పథకంపై సమావేశాన్ని నిర్వహించారు. పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన రూ.14.33 కోట్ల మెగా చెక్‌ను ఎమ్మెల్సీ మధుసూదన్‌తో కలిసి ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, మెప్మా ప్రాజెక్ట్ అధికారిణి సనాభాను, ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పొదుపు సంఘాల మహిళలు భారీగా తరలివచ్చారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

99 శాతం హామీలు అమలు

వైఎస్సార్ ఆసరా మెగా చెక్ విడుదల అనంతరం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరిగిందన్నారు. జగనన్న సంక్షేమ పథకాలను పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. జగనన్నకు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నాయని ఆరోపించారు. అవినీతిరహిత రాష్ట్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99.99 శాతం నెరవేర్చిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. గత టీడీపీ హయాంలో పొదుపు సంఘాల మహిళల ఇబ్బందులు, కష్టాలు చెప్పలేనివన్నారు. సభ్యులుగా చేరాలంటేనే పెద్దగా ఆసక్తి చూపేవారు కాదన్నారు. అయితే నేడు జగనన్న పాలనలో పొదుపు సంఘాలు నియోజకవర్గంలో అమాంతంగా పెరిగాయన్నారు. సంఘాల ద్వారా సున్నావడ్డీ రుణాలు, జగనన్న చేదోడు, వైఎస్సార్ చేయూత వంటి పథకాల కింద లబ్ధి పొందుతున్నారని తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

రూ.14.33 కోట్ల మెగా చెక్ విడుదల

ఆదోని నియోజకవర్గంలోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన రూ.14.33 కోట్లు మెగా చెక్‌ను ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఆర్‌పీలు, మెప్మా ప్రాజెక్ట్ అధికారుల చేతులమీదుగా విడుదల చేశారు. మున్సిపాలిటీలో రూ.9.17 కోట్లు, మండలంలో రూ.5.16 కోట్లకు సంబంధించిన మెగా చెక్‌ను విడుదల చేశారు. మున్సిపాలిటీలో 1575 గ్రూపులకుగాను 15,750 మంది ఉండగా, మండలంలో 1174 సంఘాల్లో 11,700 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా నిధులను వారి ఖాతాల్లో జమ చేశారు.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు


సమావేశానికి హాజరైన మహిళలు

56 నెలల కాలంలో ఆదోని నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.57.18 కోట్లు మొత్తాన్ని అందించారు.

రంగోలీతో నవరత్నాల పథకం లోగో

వైఎస్సార్ ఆసరా పథకం సందర్భంగా పొదుపు సంఘాల మహిళలు, ఆర్‌పీలు ప్రత్యేకంగా రెడ్డీస్ హాస్టల్‌లో నవరత్నాల పథకానికి సంబంధించి 9 రకాల ముగ్గులను వేశారు. జగనన్న, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఫొటోలను ముగ్గుల మధ్య ఉంచుతూ వేసిన రంగోలీలు ఆకట్టుకున్నాయి.

రూ.50 వేలు లబ్ధి పొందాను



నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం కింద లబ్ధి పొందాను. ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లలో సుమారు రూ.50 వేలు దాకా లబ్ధి పొందాను. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి ఏదో విధంగా లబ్ధి చేకూరుతోంది. మహిళల జీవితాల్లో వెలుగులు నింపారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

–సుమంగళి, మట్కారిగేరి

ఇలాంటి నాయకుడు రాష్ట్రానికి అవసరం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లాంటి నేత రాష్ట్రానికి ఎంతో అవసరం. ఆయన వచ్చిన తర్వాతే పేదల జీవితాలు బాగుపడ్డాయి. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారు. నాలుగు విడతల్లో వివిధ పథకాల కింద సుమారు రూ.2 లక్షల వరకు లబ్ధి పొందాను. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పని చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నే మా సీఎం.

–జిందే మల్లీశ్వరి, ఆదోని

నిబంధనలు పాటించకుంటే లైసెన్సులు రద్దు

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని వేరుశనగ వ్యాపారులు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి నిబంధనలు, సూచనలు పాటించకుంటే తగిన చర్యలు తీసుకుంటామని యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యార్డులో వేరుశనగకాయల టెండర్ పూర్తయిన తర్వాత వేరుశనగకాయల సంచులను వెంటనే తూకం వేయడం లేదని, సంచులు పంపడం, కాయలను శుభ్రపరచడంలో ఆలస్యం జరుగుతుండడం వల్ల యార్డుకు వేరుశనగకాయల రావడం తగ్గిందని తెలిపారు. దీని వల్ల మార్కెట్ కమిటీలో పనిచేసే కార్మికులకు జీవనోపాధి లేకుండా పోతోందని చెప్పారు. అంతేగాకుండా రైతులు చాలా ఇబ్బంది పడుతున్నట్లు తనకు ఫిర్యాదు చేశారన్నారు. ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో జరిగే వ్యాపార పద్ధతిలోనే వేరుశనగకాయల కొనుగోలు జరిపించమని రైతులు తమ కార్యాలయానికి వచ్చి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రైతులు తెచ్చిన వేరుశనగకాయల దిగుబడులను ఒకటికి రెండుసార్లు పరిశీలించి టెండర్ ధర నిర్ణయించాలన్నారు. టెండర్ ప్రకటించిన తర్వాత పాసింగ్ పేరుతో సరుకు ఆరబోసి గ్రేడింగ్ చేయడం నిబంధనలకు విరుద్ధమని, టెండర్ ధర ప్రకటించిన వెంటనే సంబంధిత సరుకు దగ్గరికి సంచులు వెంటనే పంపించి తూకాలు వేయాలన్నారు. ధరలు తగ్గించకూడదని తెలిపారు. ఈ నిబంధనలు పాటించకుంటే కమీషన్ ఏజెంట్లు, వేరుశనగకాయ వ్యాపారుల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాల్సిందే


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాల్సిందేనని ఎంపీడీఓ సుబ్బరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని బదినేహాల్ గ్రామం ఆది ఆంధ్ర పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం మంచి పోషకాలతో కూడిన భోజనాన్ని అందిస్తోందని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని రుచి చూశారు. శనివారం 199మంది విద్యార్థులకు గాను 166మంది విద్యార్థులు హాజరైనట్లు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు వివరాలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వీరస్వామిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యద,ర్శి అబ్దుల్‌వాహిద్, ఉపాధ్యాయిని కుసుమాంజలి ఉన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్ అహ్మద్, సెక్రటరీ

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు, హమాలీలు, కూలీల కోసం మరుగుదొడ్లు నిర్మించేందుకు శనివారం యార్డు చైర్మన్, సెక్రటరీలు స్థల పరిశీలన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సువిధ అనే సంస్థకు మరుగుదొడ్లు నిర్వహించేందుకు స్థలం పరిశీలించి సంస్థ నిర్వాహకులకు చూపించారు. యార్డులోని ఖాళీ స్థలంలో ఎక్కడ బాగుంటుందో సంస్థ వారికి చూపించినట్లు యార్డు చైర్మన్ మజర్ అహ్మద్, సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మూడు మరుగుదొడ్లను త్వరలో నిర్మించనున్నట్లు చెప్పారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు


సూచనలు చేస్తున్న సీఐ గోపీచంద్

ఆదోనిఅర్బన్: ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని టూటౌన్ సీఐ గోపీచంద్ సూచించారు. ఈ మేరకు శనివారం రాత్రి ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్లుబావి ప్రాంత ప్రజలకు పోలీసు చట్టాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. కర్ణాటక మద్యం సరఫరా, పేకాట, సారా తయారీ, అమ్మకం లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, మహిళలను హింసించినా, దూషించినా, చిన్న పిల్లలపై అసభ్యంగా ప్రవర్తించినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు.

మాదిగలకు సమాన అవకాశాలు కల్పించాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేత సువర్ణరాజు

కౌతాళం: మాదిగలకు రాజకీయాల్లో సమాన అవకాశాలు కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు అన్నారు. శనివారం కౌతాళంలో జైభీమ్ ఆధ్వర్యంలో మాదిగ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జైభీమ్ వ్యవస్థాపకుడు అవతారం అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలకు 15 ఎమ్మెల్యే స్థానాలు, 2 ఎంపీ స్థానాలను కేటాయించాలని కోరారు. ఫిబ్రవరి 8న కడపలో జరగనున్న మాదిగల సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో 29 ఎమ్మెల్యే, 4 ఎంపీ స్థానాలకు ఎస్సీ రిజర్వేషన్ ఉంటే మాదిగ ఉపకులాలకు వారి జనాభా దామాషా ప్రకారం సీట్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్‌దినకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు తిమోతి, జైపాల్, అన్నమయ్య, చిన్న, ఈరన్న, వీరేష్, మహదేవ, రవి పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ కేంద్రం ఏర్పాటు

కర్నూలు (లీగల్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శనివారం మార్కెట్ యార్డులో నగరంలోని హమాలీలకు ఈ–శ్రమ్, పీఎంఎస్‌వైఎం నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కమిషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబ శివుడు, లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి తమ సిబ్బందితో కలసి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసి 30 మందికి ఈ–శ్రమ్ కార్డులను నమోదు చేశారు. అదే విధంగా న్యాయానికి సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఎలా న్యాయ సహాయం పొందాలి, ఎలా సంప్రదించాలి అనే విషయాలను పారా లీగల్ వలంటీర్లు వివరించారు.

ప్రతిపక్షాలు తలదించుకునేలా అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి
- రూ.7.70 కోట్లతో రోడ్డు పనులకు శ్రీకారం
- హర్షం వ్యక్తం చేసిన చింతకుంట, పల్లెపాడు గ్రామస్తులు


పల్లెపాడు రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి/మంత్రాలయం: ఐదేళ్ల పాలనలో ప్రతి గ్రామంలో రోడ్లు ఏర్పాటు చేశామని, ప్రతిపక్షాలు తలదించుకునేలా ప్రగతి బాటలు వేశామని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం మాలపల్లి గ్రామం వద్ద రూ.4కోట్లతో రోడ్డు పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాలపల్లి నుంచి పల్లెపాడు, చింతకుంట గ్రామాల ప్రజలకు రోడ్డు వేయిస్తామని మాట ఇచ్చామని.. మాటకు కట్టుబడి ప్రత్యేక నిధులు రూ.4కోట్లు వెచ్చించి మాలపల్లి నుంచి కోసిగి వరకు 9.2 కిలో మీటర్లు రోడ్డు పనులు మొదలు పెట్టామని తెలిపారు. అలాగే డి.బెళగల్ గ్రామం నుంచి రచ్చుమర్రి కాస్ రోడ్డు వరకు 6 కిలో మీటర్లు హైఇంపాక్ట్ రోడ్డుకు రూ.2.50కోట్లు, జుమ్మాలదిన్నె గ్రామం నుంచి ఉరుకుంద వరకు 4కి.మీ రోడ్డుకు రూ.90 లక్షలతో పనులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. అలాగే జుమ్మాలదిన్నె గ్రామం వద్ద అర్జంట్ రిపేర్ స్కీమ్ కింద రూ.35లక్షలతో కల్వర్టు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నాణ్యత లోపించకుండా రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఐదేళ్లలో దాదాపు రూ.25 కోట్లతో గ్రామీణ రోడ్డు పనులు చేయించినట్లు తెలపారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద ప్రతి గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయించామని గుర్తు చేశారు. సీఎం జగనన్న చేసిన అభివృద్ధే వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా నోచుకోని రోడ్డుకు మోక్షం లభించడంపై పల్లెపాడు, చింతకుంట గ్రామాల ప్రజల సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు, పార్టీ మండల ఇన్‌చార్జ్ మురళీ మోహన్ రెడ్డికి గజమాల వేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈఈ నాగరాజు, ఏఈఈ విజయ నరేష్, కాంట్రాక్టర్ జనార్ధన్, కిరణ్ రెడ్డి, ఎంపీపీ ఈరన్న, మహంతేష్ స్వామి, సాకత్ ఆలి, బుళ్లి నరసింహులు, నరసన్న, లంకారెడ్డి, మల్లికార్జున గౌడ, నరసింహులు, నరసయ్య, చింతకుంట ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన వడ్డే రాముడు

కోసిగి: స్థానిక రైల్వే గేటు సమీపంలోని బావి వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో శనివారం మృతి చెందాడు. మృతుడు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మేస్త్రీగా పనిచేసే వడ్డే రాముడు (40) వడ్డే వీధిలో నివాసం ఉంటున్నాడు. ఇళ్ల నిర్మాణ పనులకు కూలీలను పంపించి.. మధ్యాహ్నం ఇంటికి వచ్చి బహిర్భూమి కోసం రైల్వే గేటు సమీపంలో వెళ్లాడు. పట్టాల పక్కనే బావి దగ్గర శవమై కనిపించాడు. చుట్టు పక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తలపై గాయం కనిపిస్తుండగా.. చెవులు, ముక్కుల్లో రక్త స్రావం జరిగింది. ఎవరో తలపై కొట్టి చంపేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. మృతినికి భార్య పద్మావతి, ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు ఉన్నాడు.

భక్తిశ్రద్ధలతో కాశీంస్వామి ఉరుసు

తుగ్గలి: గ్రామస్తుల ఆరాధ్య దైవం కాశీంస్వామి ఉరుసు ఉత్సవాలను పెండేకల్లులో ఘనంగా నిర్వహిస్తున్నారు. కులమతాలకతీతంగా గ్రామస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శనివారం దర్గాను సందర్శించి స్వామికి చెక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దలు, దర్గా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

- సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ


వాక్‌థాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్, డీఎస్పీ

ఆదోనిఅర్బన్: రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వాక్‌థాన్‌ను డీఎస్పీ శివనారాయణస్వామితో కలిసి ఆయన ప్రారంభించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన వాక్‌థాన్.. సాయిబాబా గుడి సమీపం మీదుగా తిరిగి టూటౌన్ పోలీస్‌స్టేషన్, కోట్ల కూడలి మీదుగా కార్యాలయానికి చేరుకుంది. కోట్ల కూడలిలో మానవహారం నిర్వహించిఅధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మితిమీరిన వేగంతో, నిర్లక్ష్యంతో, అవగాహన రాహిత్యంతో వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. తగిన వయస్సు లేకుండా, లైసెన్సు లేకుండా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మత్తు పదార్థాలు సేవించి వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరా దీప్తి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, సీఐలు తేజమూర్తి, గోపీచంద్, మంజునాథ్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి


కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో సర్పంచ్ మాల పెద్దనర్సప్ప అధ్యక్షతన సంకల్ప యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పీఎం ఆయుష్మాన్ భారత్, పీఎం గరీబ్ కళ్యాణ్, పీఎం పోషణ అభియాన్, దీన దయాల్ అంత్యోదయ యోజన, మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఎం విశ్వకర్మ యోజన, ఆవాజ్ యోజన, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, జల్‌జీవన్ మిషన్, స్వచ్ఛభారత్, పశువులకు వాక్సినేషన్, ఫూట్ మంత్ వ్యాధులు– వాటి నివారణ, ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ కార్డులు, పోషణ అభియాన్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. సాయంత్రం కుంటనహాల్ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇమ్మానియల్, పశువైద్యాధికారి మహేశ్వరి, ఏపీఓ జుబేర్‌అహ్మద్, కార్యదర్శి అబ్దుల్ వాహిద్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని చిన్నపెండేకల్ గ్రామంలో కర్ణాటక మద్యం అమ్ముతున్న బోయ వీరేష్‌ను అరెస్టు చేసినట్లు తాలూకా ఎస్ఐ మల్రిస్వామి శనివారం తెలిపారు. ఆస్పరి మండలం గాలిపెంటకు చెందిన బోయ వీరేష్ చిన్న పెండేకల్‌లో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నామని చెప్పారు. నిందితుడి వద్ద నుంచి 35 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

మహా ధర్నాను జయప్రదం చేద్దాం


మాట్లాడుతున్న క్రైస్తవ హక్కుల సమితి కన్వీనర్ హవీలాన్‌బాబు

ఆదోని సెంట్రల్: పట్టణంలో ఈ నెల 31న జరగనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ హక్కుల సమితి కన్వీనర్ హవీలాన్‌బాబు, కోకన్వీనర్ రెవరెండ్ జయంతి క్రిస్టియన్ తెలిపారు. శనివారం హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. క్రైస్తవుల హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం నాయకులు జి.అనంద రాజు, శ్రీధర్, థామస్, ఆల్బర్ట్, ఎంఎస్.రావు, ఆశీర్వాదం పాల్గొన్నారు.